క్లుప్తంగా

జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే పరిశీలన



జగనన్న సురక్ష సర్వేని పరిశీలిస్తున్న మండల స్పెషలాఫీసర్ నాగలింగాచారి

సింహాద్రిపురం : గురజాల గ్రామంలో జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేని సోమవారం మండల స్పెషలాఫీసర్ నాగలింగాచారి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఏఎన్ఎంలకు, వలంటీర్లకు సూచనలు చేశారు. ఎంపీడీఓ కృష్ణమూర్తి, వలంటీర్లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

ఎర్రగుంట్లలో..

ఎర్రగుంట్ల : జగనన్న ఆరోగ్య సురక్ష పథకంలో భాగంగా ఇంటింటి సర్వే వేగవంతంగా సాగుతోందని ఎర్రగుంట్ల, చిలంకూరు పీహెచ్‌సీ వైద్యులు తెలిపారు. సోమవారం మండల పరిధిలోని హనుమనగుత్తి గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా సచివాలయ పరిధిలోని గ్రామాలలో, పట్టణంలో వైద్య ఆరోగ్య సిబ్బంది, వలంటీర్ల ఆధ్వర్యంలో సర్వే నిర్వహించారు.

గణనాథుని నిమజ్జనం

పులివెందుల టౌన్ : స్థానిక 4వ వార్డులోని గాంధీనగర్ కాలనీలో కౌన్సిలర్ పార్నపల్లి కిశోర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుని విగ్రహాన్ని సోమవారం నిమజ్జనానికి తరలించారు. ఈ సందర్భంగా జంజాల మహేష్ రూ.1.03 లక్షలకు వేలంపాడి వినాయకుడి లడ్డూను దక్కించుకున్నారు.

జమ్మలమడుగులో..

జమ్మలమడుగు : పట్టణంలోని కన్నెలూరు నేతాజీనగర్, ఈశ్వరయ్య కాలనీలలో ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహం వద్ద వేలం పాట నిర్వహించారు. రామమోహన్‌రెడ్డి లడ్డును రూ.70 వేలకు దక్కించుకున్నారు.

ఏడుగురు జూదరుల అరెస్టు

కమలాపురం : మండల పరిధిలోని కోగటం గ్రామంలో జూదమాడుతున్న ఏడుగురిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ చిన్నపెద్దయ్య తెలిపారు. వారి వద్ద నుంచి రూ. 13,550 నగదు, పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నారు.

సమాచార హక్కు చట్టం అమలు చేయాలి

వేంపల్లె : ప్రైవేట్ విద్యాసంస్థల్లో సమాచార హక్కు చట్టం అమలు చేయాలని కౌన్సిల్ ఫర్ సిటిజన్ రైట్స్ కార్యనిర్వహణ ఇన్‌చార్జి గూడూరు రామచంద్ర పేర్కొన్నారు. సోమవారం మండల విద్యాశాఖ అధికారి స్టాలిన్ ఐజాక్‌కు వినతిపత్రం అందజేశారు.

ఘనంగా దీన్‌దయాళ్ జయంతి

పులివెందుల టౌన్/వేంపల్లె : పులివెందుల పట్టణంలోని సరస్వతి విద్యామందిరంలో సోమవారం దీన్‌దయాల్ జయంతిని జిల్లా బీజేపీ అధ్యక్షుడు శశిభూషణ్‌రెడ్డి ఆధ్వర్యంలో బీజేపీ నాయకుల నిర్వహించారు. ఈ సందర్భంగా దీన్‌దయాల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అసెంబ్లీ కన్వీనర్ చంద్రమోహన్‌రెడ్డి, రాష్ట్ర సాంస్కృతిక శాఖ కన్వీనర్ భానుప్రకాష్ తదితరులు పాల్గొన్నారు. బీజేపీ సిద్ధాంతకర్త, జనసంఘ్ వ్యవస్థాపకుడు పండిట్ దీనదయాల్ ఉపాధ్యాయ దేశానికి చేసిన సేవలు అమోఘమని బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గాలిహరిప్రసాద్ అన్నారు. వేంపల్లెలో దీనదయాల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు సుష్మా, మహేశ్వరి, బీజేపీ మండల అధ్యక్షుడు సునీల్‌కుమార్ పాల్గొన్నారు.

లింగాల కుడి కాలువను పరిశీలించిన ఎస్ఈ

లింగాల: గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు దెబ్బతిన్న లింగాల కుడి కాలువ డ్రైనేజీ, కుడి కాలవ గట్లు, పొలాలలో ప్రవహిస్తున్న వరద నీటిని నీటిపారుదల శాఖ ఎస్ఈ మల్లికార్జునరెడ్డి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుడికాలువకు ఇరువైపులా డ్రైనేజీ వ్యవస్థను పటిష్ట పరిచేందుకు భూసేకరణ నిర్వహిస్తామన్నారు. దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం అందే విధంగా ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డితో చర్చిస్తామన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు సారెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

వీరపునాయునిపల్లె : ప్రభుత్వం నిర్ణయించిన ధరలకంటే ఎక్కువ ధరలకు ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని కమలాపురం వ్యవసాయ శాఖ సహాయ సంచాలకుడు నరసింహారెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని ఎరువుల దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఏఓ శ్యామ్‌బాబు పాల్గొన్నారు.

పోట్లదుర్తిలో అగ్ని ప్రమాదం

ఎర్రగుంట్ల : పోట్లదుర్తి గ్రామంలో సోమవారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో నాగేష్, నాగార్జున, మురళిలకు చెందిన మూడు గడ్డివాములు దగ్ధమయ్యాయి. వినాయక నిమజ్జనం సందర్భంగా పేల్చిన టపాసులు పడ్డాయా.. ఆకతాయిలు నిప్పు పెట్టారా అనేది తెలియరాలేదు. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేసేలోపే నష్టం జరిగిపోయింది.

భారీ వర్షం.. పంటలకు నష్టం



ఉధృతంగా ప్రవహిస్తున్న మొగమూరు వాగు



లింగాల : బోనాల రహదారి వద్ద భారీగా ప్రవహిస్తున్న వంక



ఎర్రబల్లె చెరువుకు చేరుకున్న వరదనీరు

- లింగాల మండలంలో 52.2 మిల్లీ మీటర్ల వర్షం
- కోతకు గురైన పొలాలు
- కాలువగట్లు తెగి పూడిపోయిన కుడికాలువ

లింగాల : లింగాల మండలంలో ఆదివారం రాత్రి 52.2 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. వరుసగా మూడు రోజులపాటు భారీ వర్షాలు కురుస్తున్నందున పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. పంటపొలాలలో ఎటుచూసినా నీరు నిలిచింది. లింగాల డీప్‌కట్ కెనాల్ డ్రైనేజీ అస్తవ్యస్తంగా ఉండడం వల్ల తమ పొలాల్లోకి నీరు చేరి భూములు కోతకు గురై పంటలు నీట మునిగాయని రైతులు వాపోతున్నారు. డీప్‌కట్ కెనాల్ ఇరువైపులా గట్లు తెగి కుడికాలువలోకి పడిపోవడంతో కుడికాలువ పూర్తిగా పూడిపోయింది. కాలువలో మట్టి మేటవేసింది. అదేవిధంగా లింగాల–బోనాల రహదారి వద్ద చిన్నపైపులు వేసి కల్వర్ట్ ఏర్పాటు చేయడం వల్ల కల్వర్ట్ పైపులలో వరదనీరు పట్టక రోడ్డు కోతకు గురై కల్వర్ట్ ఇరువైపులా పంటపొలాల్లో నీరు నిలిచింది. దీంతో పంటలు కోతకు గురై నీట మునిగాయని రైతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు తగిన చర్యలు తీసుకుని కుడికాలువ డ్రైనేజీ వ్యవస్థను పటిష్టపరచి పంట పొలాల్లో నీరు నిలువకుండా చేయాలని రైతులు కోరుతున్నారు.

ఎర్రబల్లె చెరువుకు వరద నీరు

పులివెందుల రూరల్ : గత మూడు రోజుల నుంచి అనంతపురం జిల్లా, కదిరి, తలుపుల ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షాలు కురవడంతో పులివెందుల మండల పరిధిలోని నల్లపురెడ్డిపల్లె గ్రామ సమీపంలోని ఎర్రబల్లె చెరువుకు వరదనీరు వచ్చి చేరుకుంది. కదిరి, తలుపుల, బత్రేపల్లి, కొత్తపల్లె మీదుగా కనంపల్లెకు చేరుకుని అక్కడి నుంచి ఎర్రబల్లె చెరువుకు వరదనీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో ఎర్రబల్లె పంచాయతీలోని గ్రామాల ప్రజలు గంగమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గత నాలుగు సంవత్సరాలుగా ఎర్రబల్లె చెరువుకు నీరు రాలేదు. ప్రస్తుతం నీరు వస్తుండడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

భారీ వర్షాలతో రాకపోకలు బంద్

సింహాద్రిపురం : ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. సింహాద్రిపురం – వెలిదండ్ల రోడ్డులో గురిజాల వద్ద ఉన్న వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. అలాగే బి.చెర్లోపల్లె, దిద్దకుంట్ల వంకలు కూడా ఉధృతంగా ప్రవహించి జనజీవనానికి ఇబ్బంది కలిగింది. వాగు, వంకల ప్రవాహాల వద్ద రెవెన్యూ, పోలీస్ సిబ్బంది వాహనాలు వెళ్లకుండా ప్రజలను నిలిపివేసి, ఉధృతం తగ్గిన తర్వాత రాకపోకలను సాగించి ఎలాంటి ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టారు. ఈ భారీ వర్షం రైతుల్లో కొంత నిరాశ, కొంత సంతోషాన్ని మిగిల్చింది. ఖరీఫ్ పంటకు సకాలంలో వర్షం పడకపోవడంతో కొందరు రైతుల పంటల దిగుబడి తగ్గిపోవడం, మరికొందరు రైతులు పంటలు దున్నేయడం జరిగింది. దీంతో రైతులు నిరాశ చెందారు. ఈ భారీ వర్షంతో రబీ పంటకు ఉపయోగకరంగా ఉంటుందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మండలవ్యాప్తంగా 70.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని, ఈ ఏడాది ఈ వర్షమే భారీ వర్షంగా అధికారులు తెలిపారు.

లోతట్టు ప్రాంతాల్లో నీరు నిల్వ లేకుండా చూడాలి

వేంపల్లె : వేంపల్లె పంచాయతీ పరిధిలో ఉన్న లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు నిల్వలేకుండా చర్యలు తీసుకోవాలని వేంపల్లె జెడ్పీటీసీ ఎం.రవికుమార్‌రెడ్డి, సర్పంచ్ ఆర్.శ్రీనివాసులు అధికారులకు సూచించారు. గత రెండు రోజులుగా కురిసిన వర్షాలకు లోతట్టు ప్రాంతాలన్నీ జలమయం కావడంతో ఆ ప్రాంతాలను సోమవారం వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యంగా వైఎస్ఆర్ గెస్ట్‌హౌస్ వెనుకవైపు ఉన్న భరత్‌నగర్‌కాలనీ, క్రిస్టియన్ కాలనీ తదితర ప్రాంతాల్లో ఎక్కువ వర్షపు నీరు నిల్వ ఉంటుందని తెలిపారు. లోతట్టు ప్రాంతాల్లో నిల్వ ఉన్న నీటిని తరలించి అందుకు సంబంధించిన అంచనాలు తయారు చేసి పనులు మొదలుపెట్టాలని అధికారులకు సూచించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన విభాగం ప్రధాన కార్యదర్శి కసిరెడ్డి ఆదినారాయణరెడ్డి, కే.కే. సచివాలయ కన్వీనర్లు బ్రహ్మం, నాగేష్, ఖదీర్, పంచాయతీరాజ్ అధికారులు పాల్గొన్నారు.

చక్రాయపేట మండలంలో..

చక్రాయపేట : గత రెండు రోజులుగా మండలంలో కురుస్తున్న వర్షానికి వాగులు, వంకల్లోంచి వచ్చిన నీరు పాపాఘ్ని నదికి చేరుతోంది. దీంతో ఎండిపోయిన నది నీటి జాలుతో అందంగా కనిపిస్తోంది. నది ఎండి పోవడంతో ఫిల్టర్లు ఎక్కడ దెబ్బతింటాయో అని ఆందోళ చెందిన రైతన్నలు నదిలో నీరు చేరడంతో సంతోషంగా ఉన్నారు.

పాపాఘ్నికి జల కళ

కమలాపురం : గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు కమలాపురం పాపాఘ్ని నది జల కళను సంతరించుకుంది. సోమవారం తెల్లవారుజామున కురిసిన భారీ వర్షంతో కమలాపురం మండలంలో 55.2 మి.మీ. వర్షపాతం నమోదైనట్లు తహసీల్దార్ సరస్వతి తెలిపారు. కాగా గత రెండు రోజులుగా పై ప్రాంతాలతో పాటు మండలంలో కురుస్తున్న భారీ వర్షాలకు పాపాఘ్ని నదికి వదర నీరు వచ్చి చేరింది. అలాగే పంట పొలాల్లో, కాలువల్లో, వంకల్లో వరద నీరు ప్రవహించింది. పట్టణంలోని క్రిష్ణానగర్, మారుతి నగర్, రామ్‌నగర్ తదితర కాలనీలన్నీ జలమయమయ్యాయి. పాదచారులు, స్థానికుల రాక పోకలకు తీవ్ర ఇబ్బంది జరిగింది. కాగా సి.గోపులాపురం–పాచికలపాడు గ్రామాల మధ్య ఉన్న వంక ఉధృతంగా ప్రవహిచడంతో ఆ గ్రామాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

విద్యుత్ సబ్ స్టేషన్‌లో వర్షపు నీరు

చెన్నూరు : శని, ఆదివారాల్లో కురిసిన వర్షాలకు చెన్నూరులోని పలు వీధులు వర్షపు నీటితో నిండిపోయాయి, లోతట్టు ప్రాంతాలైన చెన్నూరు భవాని నగర్, యానాదికాలని, బెస్త కాలనీలలో వర్షంతో ఇళ్ల మధ్య నీళ్లు నిలవడంతో అక్కడి కాలనీల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అలాగే రామనపల్లి వంక వర్షపు నీటితో పొంగి పొర్లింది. చెన్నూరు విద్యుత్ సబ్ స్టేషన్‌లో నీరు చేరడంతో ఇక్కడి సిబ్బందికి అవస్థలు తప్పలేదు. నీటిని బయటకు పంపేందుకు సిబ్బంది శ్రమించాల్సి వచ్చిందని ఏఈ రామలింగారెడ్డి తెలిపారు.

ఉగ్రరూపం దాలుస్తున్న మొగమూరు

వీరపునాయునిపల్లె : గత రెండు రోజులుగా ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వానలకు మొగమూరు వాగు ఉగ్రరూపం దాలుస్తోంది. యన్.పాలగిరి క్రాస్ వద్ద ఉన్న పాత వంతెనపై నీరు పొంగి ప్రవహిస్తోంది. సాయంత్రం 4 గంటల వరకు సాధారణంగా ప్రవాహం ఉండగా ఒక్కసారిగా నీటి ప్రవాహ ఉధృతి ఎక్కువ కావడంతో వంతెనపై రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. ఆదివారం రాత్రి 9గంటల నుంచి సోమవారం ఉదయం 6గంటల వరకు ఎడతెరపి లేకుండా వాన కురియడంతో మండలంలోని వాగులు వంకలు పొంగి పొర్లుతున్నాయి. దీంతో లోతట్టు పొలాలు వాగులను తలపిస్తున్నాయి.



వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో నిలిచిపోయిన వాహనాల రాకపోకలు



లోతట్టు ప్రాంతాలను పరిశీలిస్తున్న జెడ్పీటీసీ ఎం.రవికుమార్‌రెడ్డి తదితరులు



వర్షపు నీటితో జలకళ సంతరించుకున్న పాపాఘ్ని నది



పాపాఘ్ని నదిలో ప్రవహిస్తున్న వరద నీరు



చెన్నూరు : విద్యుత్ సబ్ స్టేషన్‌లో నిలిచిన వర్షపు నీరు



లింగాల : రైతులతో మాట్లాడుతున్న ఇరిగేషన్ శాఖ ఎస్ఈ

జగనన్న భరోసా ప్రజలకు కొండంత అండ

ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

చక్రాయపేట: రాష్ట్ర ప్రజలకు జగనన్న భరోసా కొండంత అండ అని కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఇడుపులపాయలోని వైఎస్ఆర్ అతిథి గృహంలో పాడా ఓఎస్డీ అనిల్ కుమార్‌రెడ్డి, మండల ఇన్‌చార్జి వైఎస్ కొండారెడ్డిలతో కలసి జగనన్న భరోసా కార్యక్రమంలో భాగంగా మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యులు, బూత్ కన్వీనర్లు బూత్‌కమిటీ సభ్యులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. గ్రామ పంచాయతీల వారీగా వినతి పత్రాలు స్వీకరించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన తన దృష్టికి వచ్చిన సమస్యల్లో కొన్నింటిని ఆయా శాఖల అధికారులతో మాట్లాడి పరిష్కరించాలని సూచించారు. ముఖ్యంగా అన్ని గ్రామాల నుంచి విద్యుత్ సమస్యలు, భూసమస్యలు అధికంగా ఉండటంతో వాటి పరిష్కారానికి ట్రాన్స్‌కో ఏడీఈ శ్రీకాంత్, పులివెందుల ఆర్డీఓ వెంకటేశ్వర్లు, పాడా ప్రత్యేక తహసీల్దార్ రాంభూపాల్ రెడ్డిలకు సిఫారసు చేశారు. ఏపీ టూరిజం రాష్ట్ర డైరెక్టర్ ప్రవీణ్ కుమార్ రెడ్డి, ఎంపీపీ మాధవీబాలకృష్ణ, జెడ్పీటీసీ సభ్యుడు శివప్రసాదరెడ్డి, మండల యూత్ కన్వీనర్ రామాంజనేయరెడ్డి, వైఎస్సార్‌సీపీ గ్రీవెన్స్ సెల్ జిల్లా అధ్యక్షుడు ప్రసాదరావు, మండల జేసీఎస్ కన్వీనర్ రామాంజులరెడ్డి, ఎంపీడీఓ శివారెడ్డి, మండల సమన్వయకర్త ఓబుళరెడ్డి పాల్గొన్నారు.



ప్రజా సమస్యలను ఆలకిస్తున్న ఎంపీ అవినాష్‌రెడ్డి

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

పులివెందుల రూరల్ : మహిళలు అన్ని రంగాలలో రాణించాలని మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్‌లు అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో మెప్మా ఆధ్వర్యంలో ఆదిలక్షుమ్మ ఆహా క్యాంటిన్‌తో పాటు అర్బన్ మార్కెట్ సమీపంలో స్వయం సహాయక సభ్యులు తయారుచేసిన ఉత్పత్తుల కేంద్రాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళల ఆర్థిక పురోభివృద్ధి కోసం సీఎం వైఎస్ జగన్ అమలు చేస్తున్న పథకాలు, మంజూరు చేస్తున్న నిధులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రాష్ట్ర సివిల్ సప్లై డెరెక్టర్ హాల్ గంగాధర రెడ్డి, మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి, ఆసుపత్రి సూపరింటెండెంట్ డేవిడ్ సెల్వరాజ్, మెప్మా అధికారులు గంగులయ్య, నాయుడు, నాగన్న, కౌన్సిలర్ కిశోర్, మాజీ కౌన్సిలర్ అరుణ, వైఎస్సార్‌సీపీ నాయకులు సూరి, ఆర్పీలు, పొదుపుసంఘాల మహిళలు పాల్గొన్నారు.



ఆహా క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న వైఎస్ మనోహర్‌రెడ్డి, వరప్రసాద్

గ్రామ పునర్నిర్మాణ పనులకు శంకుస్థాపన

వేంపల్లె : వేంపల్లె మండలం కత్తులూరు గ్రామ పంచాయతీ పరిధిలోని మిట్టపల్లి గ్రామాన్ని నందిపల్లి గ్రామ సమీపానికి బదిలీ చేయడంతో ఆ గ్రామానికి సంబంధించి పునర్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసినట్లు వేంపల్లె జెడ్పీటీసీ ఎం.రవికుమార్‌రెడ్డి, మండల కన్వీనర్ చంద్ర ఓబులరెడ్డిలు పేర్కొన్నారు. సోమవారం అందుకు సంబంధించి వారు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మిట్టపల్లి గ్రామస్తులు చాలామంది ఆ ఊరిని వదిలి చుట్టుపక్కల ఉన్న గ్రామాలకు వెళ్లిపోయారన్నారు. మిగిలిన 62 కుటుంబాల వారు ఈ విషయాన్ని స్థానిక నాయకులతో కలిసి కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డికి విన్నవించారు. ఈ నేపథ్యంలో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి ఆ గ్రామాన్ని వేరే చోటికి మార్చాలని కోరారు. సీఎం స్పందించి ఆ గ్రామస్తులకు అనువైన ప్రభుత్వ స్థలాన్ని కేటాయించి ఇళ్లను కూడా నిర్మించి ఇవ్వాలని ఆదేశించారు. . మొదటి దశలో 20 ఇళ్ల నిర్మాణం చేపట్టేందుకు భూమిపూజ చేశామన్నారు. ఆ గ్రామానికి అవినాష్ నగర్‌గా నామకరణం చేశామన్నారు. హౌసింగ్ ఏఈ సుబ్రమారెడ్డి, పంచాయతీరాజ్ డీఈ రవిచంద్రరెడ్డి, హౌసింగ్‌బోర్డు ప్రతినిధి సుహాష్, తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీపీ లక్ష్మిగాయత్రి, సర్పంచ్ సులోచనమ్మ, మాజీ సర్పంచ్ ఆర్.ఎల్.వి ప్రసాద్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు మారం శ్రీకాంత్ రెడ్డి, విశ్వనాథ్, వీరేంద్రనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.



భూమిపూజ చేస్తున్న వేంపల్లె జెడ్పీటీసీ ఎం.రవికుమార్‌రెడ్డి, తదితరులు

గజ వాహనంపై శ్రీరంగనాథుడు



పులివెందుల టౌన్ : పులివెందుల మున్సిపాలిటిలోని శ్రీరంగనాథస్వామి ఆలయంలో నూలు పూజ పవిత్రోత్సవాల్లో భాగంగా సోమవారం శ్రీరంగనాథుడు గజ వాహనంపై సతీసమేతంగా భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకుడు కృష్ణరాజేష్‌శర్మ ఉభయదారులచే ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిపించారు. ఆలయ చైర్మన్ సుధీకర్‌రెడ్డి, ఈఓ కేవీ రమణ, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

ఎంపీడీఓగా సుబ్రహ్మణ్యశర్మ

చెన్నూరు : చెన్నూరు మండల ఎంపీడీఓగా డి.సుబ్రహ్మణ్యంశర్మ సోమవారం బాధ్యతలు చేపట్టారు, ఆయన నంద్యాల నంద్యాల జిల్లా జూపాడు బంగ్లా మండలంలో ఈఓపీఆర్డీగా పనిచేస్తూ పదోన్నతిపై చెన్నూరు ఎంపీడీఓగా వచ్చారు. ఎంపీపీ చీర్ల సురేష్ యాదవ్ నూతన ఎంపీడీఓను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

జగనన్న పాలనలోనే పేదలకు సంక్షేమ పథకాలు

పులివెందుల టౌన్ : జగనన్న ప్రభుత్వం ప్రతి పేద వాడికి అండగా ఉంటూ వారికి సంక్షేమ ఫలాలు అందజేస్తోందని మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్ రెడ్డి పేర్కొన్నారు. కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ఆదేశాల మేరకు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సోమవారం స్థానిక గుంతబజారు ప్రాంతాల్లో నిర్వహించారు. గడపగడపకు వెళ్లి ప్రతి ఒక్క కుటుంబాన్ని పలకరించారు. జగనన్న ప్రభుత్వంలో జరిగిన మేలును, అందిన పథకాలను వివరించారు. ఇంకా అందాల్సిన పథకాల గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రజల నుంచి వచ్చిన సమస్యలను అధికారుల ద్వారా వెంటనే పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, సివిల్‌సప్లై రాష్ట్ర డైరెక్టర్ హాల్ గంగాధర రెడ్డి, కౌన్సిలర్లు పార్నపల్లి కిశోర్, కోడిరమణ, ఖాదర్‌బాషా, జేసీఎస్ ఇన్‌చార్జి చంద్రమౌళి, కోఆప్షన్ మెంబర్ చంద్రమౌళి, వైఎస్సార్‌సీపీ నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



లబ్ధిదారులకు జగనన్న సంక్షేమ పథకాలను వివరిస్తున్న వైఎస్ మనోహర్‌రెడ్డి, తదితరులు

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం



బాల్య వివాహాలపై అవగాహన ర్యాలీ



మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భారతి

వీరపునాయునిపల్లె : బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని ఐసీడీఎస్ వీరపునాయునిపల్లె సెక్టార్ సూపర్‌వైజర్ జయలక్ష్మి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో బాల్య వివాహాల నిర్మూలనపై విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువతులకు 18 సంవత్సరాలు, యువకులకు 21 సంవత్సరాలు పూర్తయినంత వరకు వివాహాలు చేయకూడదన్నారు. చట్ట విరుద్ధంగా బాల్య వివాహం నిర్వహిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాయసంపల్లె సెక్టార్ సూపర్‌వైజర్ లక్ష్మిదేవి, పాఠశాల ఉపాధ్యాయులు చెన్నక్రిష్టారెడ్డి, శ్రీదేవి, విద్యార్థులు పాల్గొన్నారు.

కమలాపురంలో..

కమలాపురం : బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం అని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భారతి తెలిపారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కాలనీ ప్రాథమిక పాఠశాలలో సీడీపీఓ వసంతబాయి ఆదేశాల మేరకు ఆమె బాల్య వివాహాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 18ఏళ్లు నిండని అమ్మాయిలకు వివాహం చేసిన, ప్రోత్సహించిన వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రతి పుస్తకం విలువైనదే



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందిస్తున్న రాజగోపాల్ రెడ్డి

కమలాపురం : ప్రతి పుస్తకం విలువైనదేనని సీఎస్ఎస్ఆర్ అండ్ ఎస్ఆర్ఆర్ఎం డిగ్రీ, పీజీ కళాశాల కరస్పాండెంట్ రాజగోపాల్ రెడ్డి తెలిపారు. కళాశాలలో ఏర్పాటు చేసిన పుస్తక సేకరణ సోమవారం విజయవంతంగా ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాలా మంది తమ పాత పుస్తకాలు పక్కన పడేస్తుంటారని, ఇది సరికాదన్నారు. పుస్తక దాతలు తమ కళాశాలలో తమకు పనికిరాని పుస్తకాలను అందించాలన్నారు. వాటిని తాము ప్రదర్శిస్తామన్నారు. ప్రతి పుస్తకం విలువైనదేనని, ఎవరో ఒకరికి అది ఉపయోగ పడుతుందన్నారు. తమ కళాశాలలో పుస్తక సేకరణ చేస్తున్న సిబ్బంది విజయభారతి, హేమ సుందరి, రవిలను ఆయన అభినందించారు. అలాగే ప్రతి నెల పుస్తక సేకరణలో భాగంగా నిర్వహించే వ్యాసరచన పోటీలలో విజేతలుగా నిలిచిన శ్రావ్య, ఆయేషా, సనా పర్వీన్, జాహిదాలకు ఆయన ప్రశంసా పత్రాలు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.